

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం,నవంబర్12ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 5,850క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో68.377 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 400, ఎన్ఎఫ్‌సికి 700, పెన్నా డెల్టాకు 2150 కండలేరు వరద కాలువకు 2600 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.263 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# కాలువలకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే



### ఆనందం వ్యక్తం చేసిన రాళ్లపాడు ఆయకట్టు రైతాంగం



**లింగసముద్రం, నవంబర్ 12, ప్రభాతవార్త** రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద మంగళవారం రాళ్లపాడు ఆయకట్టు రైతులు, అధికారులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముందుగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుడి, ఎడమ కాలువల గేట్లు తెరిచి కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ దేవుడి దయతో ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజక్టులో నీరు చేరిందని, అలాగే సోమశిల ప్రాజెక్టు నుంచి మనకు రావాల్సిన 1.5 టీఎంసీల నీరు కూడా ప్రాజెక్టుకు వస్తుందని దీని ద్వారా రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీటి మట్టం చేరుకుంటుందని తెలిపారు.ఈ సీజన్లో ఆయకట్టు రైతులు వరి పంట పండించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతుల ఆకాంక్షకు అనుగుణంగా ప్రాజెక్టు నుంచి రైతుల పొలాలకు కాలువ ద్వారా నీటి విడుదల చేయడం ఒక రైతు బిడ్డగా తనకు ఎంతో ఆనందం కలిగించిందని ఎమ్మెల్యే తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీరు రాక వరి పంటను సాగు చేయలేకపోయారని, కానీ ఈ సీజన్లో వరి పంటకు చివరి ఆయకట్టు పొలం వరకు నీరు అందించే బాధ్యత తీసకుంటానని ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి సూచనలతో ఆర్థిక శాఖ మంత్రి వర్యులు నిన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో చెప్పిన విధంగా సూపర్‌సిక్స్ పథకాలకు అమలు చేసే విధంగా బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులకు ఎక్కువ కేటాయింపులు చేసిందని తెలిపారు. గత జగన్ సర్కార్ 2023-24 లో సాగునీటి కోసం కేటాయించింది. కేవలం రూ.697 కోట్లు మాత్రమేనని కానీ ప్రస్తుత ప్రభుత్వం రూ.1447.20 కోట్లు కేటాయించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సోమవారం మంత్రి వర్యులు అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం రూ.4500 కోట్లు కేటాయింపు జరగడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ఒక్కొక్క రైతు ఖాతాలో ప్రతి సంవత్సరం రూ.20వేల రూపాయలు చొప్పున జమ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా రాళ్లపాడు ఆయకట్టు రైతాంగం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఇంగోలు సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మీ, ప్రాజెక్టు డీఈలు వెంకటేశ్వరరావు, మధుసూదన్, మండల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య, టీడీపీ నాయకులు పూరిమిట్ల బాలకోటయ్య, గొర్రెపాటి సాంబయ్య, బోయళ్ళ కొండప నాయుడు, పూరిమిట్ల గురునాథం, తోపూరి రమేష్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు రాళ్ళపాడు ఆయకట్టు రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్ష ప్రభావప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలకు సిద్ధం

### కమిషనర్ సూర్య తేజ



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 12,ప్రభాతవార్త:** వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న వర్షాలకు వరద ప్రభావానికి లోనయ్యే వివిధ ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉండాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు.మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జ్,రామలింగాపురం,బాక్స్ బ్రిడ్జ్ పంప్ హౌస్ తదితర ప్రాంతాలను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీటి ప్రవాహం జనావాసాల్లో ఆగిపోకుండా ఎప్పటికప్పుడు డ్రైను కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని ఆదేశించారు.నగర వ్యాప్తంగా ప్రధాన మార్గాలు,అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు వర్షపు నీరు తోడివేయాలని కమిషనర్ ఆదేశించారు.భారీ వర్షాల ప్రభావానికి గురయ్యే అన్ని డివిజనుల్లో ప్రజాజీవనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఈ.ఈ.లు శేషగిరిరావు,రాహంతూ జాని,డి.ఈ.ఈ ప్రసాద్,అమెనీటి కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్‌గా "తటవర్తి" నియామకం



**కావలి, నవంబర్ 12 ప్రభాతవార్త** ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్‌గా కావలికి చెందిన రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి తటవర్తి వాసు నియమితులయ్యారు. 32 సంవత్సరాలుగా పార్టి మారకుండా తెలుగుదేశంపార్టి నాయకుడుగా తటవర్తి కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని ఆర్యవైశ్య అగ్రనేతలకు తటవర్తి సుపరిచితుడు. రాష్ట్రంలోని టిడిపి అగ్రనేతలతో నిత్యం సత్సంబంధాలు కొనసాగిస్తూ మంచిపేరు తెచ్చుకున్నారు. టిడిపి నెల్లూరుజిల్లా వాణిజ్య విభాగం అద్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రతినిధిగా, కావలి పట్టణ యువత అద్యక్షులుగా, వార్డు అద్యక్షులుగా, పట్టణ కార్యవర్గ సభ్యులుగా, తెలుగు యువత నెల్లూరుజిల్లా ఉపాద్యక్షులుగా తటవర్తి వాసు పనిచేశారు. ఆ పదవులకు వన్నె తెచ్చారు. టిడిపి పార్టిలో వివాద రహితుడుగా తటవర్తి మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన పార్టిలో చేసిన సేవలకు గుర్తింపుగా ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్‌గా తటవర్తిని నియమించారు. ఈ సందర్భంగా తటవర్తి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడతానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, కావలి శాసనసభ్యుడు దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలకు తటవర్తి వాసు కృతజ్ఞతలు తెలిపారు.

**-పలువురు అభినందనలు**...కావలి ప్రాంతంలో వస్త్ర వ్యాపారిగా, ఆర్యవైశ్య నేతగా అందరికి సుపరిచితుడైన తటవర్తి వాసు ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్‌గా నియమితులు కావడంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. పలు రంగాల్లోని నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వారు కోరారు.

# విజయవంతంగా మెడికవర్‌లో అరుదైన ట్రకియల్ సర్జరీ



**నెల్లూరు, నవంబర్ 12, ప్రభాతవార్త-వైద్యం** శ్వాసతీసుకోలేని పరిస్థితిలో తీవ్రమైన ఆయాసంతో వచ్చిన 85 ఏళ్ల వృద్ధురాలికి తమ ఆసుపత్రిలో ట్రకియల్ స్టినోసిస్ అనే అరుదైన సర్జరీ చేసి ఆమె ప్రాణాలు కాపాడామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను రోగి మనువడు నరేష్‌తో కలిసి మంగళవారం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో జరిగిన విలేకర్ల సమావేశంలో వివరించారు. అనంతసాగరం మండలం బొమ్మవరం గ్రామానికి చెందిన 85 ఏళ్ల వెంకటమ్మ నాలుగు రోజుల క్రితం ఊపిరితీసుకోలేకపోవడం, ఆయాసం, ఆహారం తీసుకోలేకపోవడం లాంటి లక్షణాలతో వచ్చిందన్నారు. వెంటనే ఆమె హిస్టరీని పరిశీలించామన్నారు.ఆమె గతంలో నోటీలో ఈటీ ట్యూబ్‌తో వెంటిలేటర్ మీద 10 రోజులు ఉన్నట్లు తెలిసిందన్నారు. దీంతో ఆమెకు అత్యంత అధునాతన బ్రాంకియో స్కోపి పరికరంతో పరీక్ష చేశానన్నారు. శ్వాసనాళంలో కండపెరిగి గడ్డలాగా తయారైందని తెలిసిందన్నారు. వృద్ధురాలైనప్పటికి ఎలాగైనా ఆమెను బతికించాలని ఆ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని మత్తు డాక్టర్ల సాయంతో ట్రకియల్ స్టినోసిస్ గ్రేడ్-4 అనే గడ్డను సర్జరీ చేసి తొలగించామన్నారు. ఈ ఆపరేషన్‌కు చెన్నైలో రూ.2లక్షలు వరకు ఖర్చవుతుందన్నారు. ఇక్కడ నలభై వేలలోపు ఖర్చుతో ఆపరేషన్ చేశామన్నారు. క్రిటికల్ కేర్ హెడ్ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ నెల్లూరులో మెడికవర్‌లో అత్యంత అడ్వాన్స్‌డ్ బ్రాంకియో స్కోప్, అధునాతన క్యాథల్యాబ్, ఇతర వైద్య పరికరాలతో పాటు మంచి నైపుణ్యం గల డాక్టర్లున్నారన్నారు. టీం వర్క్‌తో రోగికి నాణ్యమైన వైద్యసేవలందిస్తున్నామన్నారు. మెట్రో నగరాల్లో అందే వైద్యసేవలన్ని మెడికవర్‌లో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అనస్థీషియన్ చీఫ్ డాక్టర్ రంగనాథ్, ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, క్యాన్సర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ డాక్టర్ బిందు భార్గవిరెడ్డిలు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో జిల్లాకు అధిక నిధులు



**కోవూరు, నవంబం12 ప్రభాతవార్త :** అసెంబ్లీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నెల్లూరు జిల్లాకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అధిక మొత్తంలో నిధులు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని, గత ప్రభుత్వంలో ఇరిగేషన్ రంగానికి ఆశించిన మేర నిధులు విడుదల చేయలేదని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ బడ్జెట్‌లో ఇరిగేషన్ రంగానికి అధికంగా నిధులు కేటాయించారన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు కోసం మొత్తం 880 కోట్లు కేటాయించగా.. అందులో ఉమ్మడి జిల్లా పరిధిలో 422 కోట్లు నిధులు కేటాయించారన్నారు. అదేవిధంగా సోమశిల ప్రాజెక్టు కొరకు 210 కోట్లు, పెన్నా డెల్టా కెనాల్ సిస్టమ్ అభివృద్ధి కొరకు 33.42 కోట్లు, స్వర్ణముఖి, సోమశిల లింక్ కాలువలకు 66 కోట్లు, ఖండలేరు లిఫ్ట్ కెనాల్‌కు 11 కోట్లు, కనుపూరు కాలువ కొరకు 7 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టుకు 393 కోట్లు కేటాయించడం వలన మన జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో భారీగా నిధులు దక్కాయన్నారు. వీటితో పాటు రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టుల అభివృద్ధికి నెల్లూరు నగరంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలు పూర్తి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి, మంత్రులకు జిల్లా తెలుగుదేశం పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా ఆచార్య ఎం. అనిత



**కోవూరు, నవంబం12 ప్రభాతవార్త :** కోవూరుకు చెందిన రిటైర్డ్ తహసీల్దార్ పెంచలయ్య కుమార్తె ప్రస్తుతం కడపలోని యోగి వేమన యూనివర్శిటీలో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ మేరకు నవంబర్ 11 గురు పూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక అయి ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబుల చేతుల మీదుగా అభినందన పురస్కారం అందుకున్నారు. యోగి వేమన యూనివర్శిటీలో ఆర్థిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య ఎం. అనిత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక అయ్యారు. యూనివర్శిటీలో ఆర్థిక శాస్త్ర విభాగంలో కోఆర్డినేటర్‌గా, విభాగాధిపతిగా, ఐక్యూ ఏసీ మెంబర్‌గా, బీవోఎస్ చైర్మన్‌గా ఆమె అనేక బాధ్యతలు నిర్వహించారు. రూసా ప్రాజెక్టును సైతం ఆమె పూర్తి చేశారు. ఈమె రాసిన పలు పబ్లికేషన్లు 30కిపైగా జాతీయ, అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. కోవూరుకు చెందిన అనిత రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక కావడం పట్ల సన్నిహితులు, బంధుమిత్రులు ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. అనిత భర్త ప్రస్తుతం ఇందుకూరుపేట మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

## సిఎంచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రొఫెసర్ ఎ. బాలసుబ్రమణ్యన్



**ముత్తుకూరు, నవంబర్ 12, ప్రభాతవార్త** విజయవాడలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చేతుల మీదుగా, మంత్రి లోకేష్ సమక్షంలో ముత్తుకూరు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న ఫిషరీస్ విభాగం ప్రొఫెసర్ ఎ. బాలసుబ్రమణ్యన్ అందుకున్నారు. నూతనంగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీ నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ప్రథమ ఉపాధ్యాయులుగా ఆయన గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీ అధికారులు ప్రొఫెసర్ ఎ. బాలసుబ్రమణ్యన్‌ని అభినందించారు. మత్స్య కళాశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసారు.

## పిడుగుపాటుకు 11 గొర్రెలు మృతి



**కావలిరూరల్, నవంబర్ 12 ప్రభాతవార్త** కావలిరూరల్ మండలం కొత్తసత్రం రెడ్డిపాళెం గ్రామానికి చెందిన నక్క రామచంద్రయ్య తన గొర్రెలను మంగళవారం పొలాల్లోకి మేతకు తీసుకునివెళ్లగా అక్కడ ఒక్కసారిగా మెరుపులతో కూడిన భారీ శబ్దంతో పిడుగు గొర్రెలు ఉన్న ప్రాంతంలో పడడంతో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందడం జరిగింది. ఈ ఎర్రబట్టలు గొర్రెలు కావడంతో మార్కెట్‌లో జత గొర్రెలు 60వేలరూపాయలు పలుకుతుందని ఈ పిడుగుపాటు వలన అధిక మొత్తంలో నష్టపోవడం జరిగిందని బాధితరైతు తెలియచేశాడు. రాముడుపాలెం సచివాలయ వెటర్నరి వైద్యులు సర్వేశ్వరరావు సంఘటస్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనావేసిపై అధికారులకు తెలియచేశారు.

## తుఫాన్ తీవ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : ఎమ్మెల్యే



**కందుకూరు, నవంబర్ 12, ప్రభాతవార్త** కందుకూరు నియోజకవర్గ ప్రజలందరూ తుఫాన్ తీవ్రత పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని తుఫాన్ సమయంలో తీవ్రమైన పెను గాలులు వీచే అవకావం, పిడుగులు పడే ప్రమాదం ఉంది, కాబట్టి పశువుల కాపరులు, రైతులు, మరి ముఖ్యంగా మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లల తల్లులు, వయో వృద్దులు ఇల్లు విడిచి బయటకు రావద్దన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు సిబ్బంది గ్రామ సచివాలయం వద్ద అందరికి అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కందుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి సచివాలయ ఉద్యోగులు, టీడీపీ పార్టీ నేతలు సిద్దంగా ఉండాలని కోరారు.

## తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండండి : మాజీ ఎమ్మెల్యే



**కందుకూరు, నవంబర్ 12, ప్రభాతవార్త** కందుకూరు నియోజకవర్గ ప్రజలందరూ తుఫాన్ తీవ్రత పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని, తుఫాన్ సమయంలో తీవ్రమైన పెను గాలులు వీచే అవకాశం, పిడుగులు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున కాబట్టి పశువుల కాపరులు, పంట పొలాల్లో పనులు చేసే రైతులు మరి ముఖ్యంగా వేటకు వెళ్లకుండా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పిల్లలు, స్త్రీలు, చిన్న పిల్లల తల్లులు, వయో వృద్దులు, ఇల్లు విడిచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు.

## దేవిస్‌పేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లపరెడ్డికి శుభాకాంక్షలు



**ఇందుకూరుపేట, నవంబర్ 12, ప్రభాతవార్త** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి వర్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో ఇందుకూరుపేట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నెల్లూరు వెంకటరమణయ్య, మేనాటి ప్రసాద్, కదురు వెంకయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## నగరంలో శిక్షణలోవున్న ఐ.ఏ.ఎస్.లు



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 12,ప్రభాతవార్త:** నెల్లూరు అర్బన్ ఫీల్డ్ విజిట్ రెండు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా శిక్షణలో వున్న ఐఏఎస్ లు నగరంలోని పలు ప్రాంతాలలోని పారిశుద్ధ్య నిర్వహణ,భక్తవత్సల నగర్ నందు మున్సిపల్ హైస్కూల్ విద్యాభోధన విధానాన్ని టీచర్ల ద్వారా తెలుసుకున్నారు.అనంతరం జాకీర్ హుస్సేన్ నందు మురికివాడలో నివసించు ప్రజల జీవన విధానాన్ని,స్వచ్ఛ భారత్ మిషన్ గురించి నెల్లూరు కార్పొరేషన్ అదనపు కమిషనర్ వై.ఓ.నందన్ వారికి అన్ని విషయాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టి.పి.ఆర్.ఓ బాలకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్‌గా దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఎంపిక



**నెల్లూరు,నవంబరు12 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్‌గా జనసేన పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఎంపికైయ్యారు.ఈ కార్పోరేషన్‌కు సంబంధించి మరో 14మంది సభ్యులతోకూడిన జాబితాను కూటమి ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్నీ ప్రాంతాల నుండి కార్పోరేషన్‌లోని డైరెక్టర్ల సాధనాల్లో కూటమి సభ్యులకు అవకాశం దక్కింది. కాగా జనసేన పార్టీకి చెందిన దుజయ్‌బాబుకు డైరెక్టర్ పదవి దక్కటం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా సుజయ్‌బాబును ఆ పార్టీ నాయుకులు, కార్యకర్తలు ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. సుజయ్‌బాబు మాట్లాడుతు ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్‌గా తనను ఎంపిక చేసేందుకు కృషి చేసిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి నూరుశాతం పనిచేస్తామని, ఆర్యవైశ్యుల అభ్యున్నతికి పాటుపడతామని పేర్కొన్నారు. శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ




**వింజమూరు, నవంబర్12ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గ సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులకు మంగళవారం వింజమూరులోని గృహనిర్మాణశాఖ సబ్‌డివిజన్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి హౌసింగ్ పిడి వేణుగోపాల్, ఇఇ మాధవరావ్, డిఇ సయ్యద్ పిరాన్ లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా పిడి వేణుగోపాల్ మాట్లాడుతూ 100రోజుల కార్యక్రమంలో తీసుకోవాల్సిన చర్యలు, గృహనిర్మాణాల పై ఎలాంటి ప్రణాళికలుఅమలు చేయాలో వివరించారు. నియోజకవర్గంలోని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వారి పరిధిలోని గృహనిర్మాణాల లబ్ధిదారులతో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేసి నిర్మాణాలు వేగవంతం చేసేలా చైతన్యపరచాలన్నారు. నాణ్యతాప్రమాణాలతో నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. నిర్మాణాల దశలను బట్టి బిల్లులు ఎప్పటికప్పుడు గృహనిర్మాణశాఖ అధికారులు లబ్ధిదారులకు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుడ్లూరు, నవంబర్ 12, ప్రభాతవార్త నైరుతి బంగాళాఖాతం నుండి తూర్పు మధ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం, ద్రోణి కొనసాగుతుంది. భారత వాతావరణ శాఖ తెలిపిన విధంగా దీని ప్రభావంతో ఏపీలో వర్షాలు కురుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, దక్షిణ కోస్తాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ అప్రమత్తం చేశారు. నైరుతి బంగాళాఖాతం మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి ఆవరించి ఉందని, దీని ప్రభావంతో మంగళ, బుధ, గురువారాల్లో వానలు పడతాయని చెప్పారు.

## కాండం తొలిచే పురుగు నివారణకు కొనలను తుంచి వరి నాట్లు వేసుకోవాలి



**గుడ్లూరు, నవంబర్ 12, ప్రభాతవార్త** మండలంలోని చిమిడితిపాడు, పొట్లూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి బి.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వరి నాట్లు వేసే పొలాన్ని సందర్శించి సూచనలు, సలహాలు అందించారు. నాట్లు వేసేముందుగా వరి నారు యొక్క కొనలను తుంచి నాటినయెడల కండం తొలిచే పురుగు ప్రధాన పొలంలో ఆశించకుండా నివారించవచ్చున్నారు. కాండం తొలుచు పురుగు గుడ్లను ఆకులచివరి భాగంలో పెడుతుంది. ప్రధాన పొలంలో కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించి నివారించవచ్చని తెలియజేశారు. గ్రామ సర్పంచ్‌లు, నాయకులు, ఉద్యాన వ్యవసాయ సహాయకులు స్వర్ణ, వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

## చిన్నపావని, పెద్దపవని గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం




**లింగసముద్రం, నవంబర్ 12, ప్రభాతవార్త** మండలంలోని చిన్న పవని, పెద్దపవని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.అబ్రహం లింకన్ మాట్లాడుతూ వరి రకం కేఎంఎస్ 1638 నారుమడి నాట్లు వేసుకునే రైతులు వారు నారు నాటే వారం రోజులు ముందు నారు మడిలో ఒక సెంట్‌కి 160 గ్రాములు కార్బోఫ్యూరిన్ 3 మూడు అంగుళాలకి వేసుకుని నాటుకొనినచో ఉల్లి కోడు నుంచి కాపాడుకోవచ్చున్నారు. వరి నాటే ముందు చివరి దుక్కిలో యూరియా 50 కేజీలు సింగల్ సూపర్ ఫాస్పేట్ 180 కేజీలు లేదా డీఏపీ 50 కేజీలు మార్కెట్ ఆక్వా పొటాష్ 30 కేజీలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ అధికారులు నజీర్, ప్రేమ్‌బాబు పాల్గొన్నారు.

## ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన




**సైదాపురం, నవంబర్ 12, ప్రభాతవార్త** మండల పరిధిలోని దేవరవేమూరు, కలిచేడు గ్రామ రైతు సేవా కేంద్రంలో పొలం పొలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారిణి హైమావతి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖకు సంబంధించి అనుబంధ శాఖలతో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరవేమూరు గ్రామంలో రైతులు వేసిన పంటలను పరిశీలించి ఆధునిక సాగు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం హైమావతి మాట్లాడుతూ రైతులు పొలానికి సంబందించి కొనలు తుంచి నాటుకోవాలని, ఇలా చేయడం వలన కాండం తొలుచు పురుగు యొక్క ఉధృతి తగ్గించుకోవచ్చని అన్నారు. వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ఆమె రైతులకు వివరించారు. రబీ సీజన్ మొదలు కావడంతో రైతులు లాభసాటి వ్యవసాయం చేసేందుకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాజారావు, రేవతి, శ్రీకర్, మస్తాన్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో కాంస్యపతకాలు సాధించిన కరేడు విద్యార్థులు



ఉలవపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త మండలంలోని కరేడు పాతాళం వెంకట సుబ్బయ్య శ్రేష్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కాంస్య పతకాలుసాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొన్నూరు శ్రీనివాసులు తెలియజేశారు. ఈనెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దొడ్ల యోషితారెడ్డి, కంబోతు లక్ష్మీ గాయత్రి, ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వీరు జిల్లా జట్టులో మంచి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించి కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరక్టర్ ఒగుబోయిన శ్రీనివాసులు చెప్పారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కోటంగారి బాలేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

## ప్రజల సమస్యలు పట్టని వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి



కందుకూరు, నవంబర్ 12, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి పరిష్కారం దిశగా అడుగులు వేయడానికి దేవాలయం లాంటి అసెంబ్లీ వేదిక అయినప్పటికి అసెంబ్లీ సమావేశాలకు వెళ్ళకుండా మొహం చాటేసి ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా రాజీనామా చేసి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా ఓట్లు వేసి 11 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన విషయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, పులి వెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మర్చిపోయాడేమోననే అనుమానం కలుగుతుందని మోషే మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నా నాకు వచ్చిన నష్టమేమి లేదని నాకు మాత్రం ప్రతిపక్ష నేత హోదా కల్పిస్తే అసెంబ్లీకి వస్తానని జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై దృష్టి సారించి పరిపాలనను గాడినపెడుతుంటే చూస్తూ ఓర్వలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తూ పబ్బంగడుపుకుంటున్నాడే తప్ప ప్రజలకు ఏమి అవసరమో కనీస అవగాహన లేని వ్యక్తిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారని మోషే ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవర్తిస్తున్న తీరు దేనికి నిదర్శనమో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు.

## ఆడిట్‌పై సీఆర్‌పీలు ప్రత్యేక దృష్టి సారించాలి



కోవూరు, నవంబం12 ప్రభాతవార్త : కోవూరు సంఘమిత్ర ఏరియా పరిధిలోని ఆరు మండలాలకు సంబంధించిన ఆడిట్ సీఆర్‌పీలకు మంగళవారం కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో పొదుపు గ్రూపుకు సంబంధించిన ఆడిట్ వ్యవహారాలపై రిసోర్స్ పర్సన్స్ హరి, వెంకటరమణయ్యలు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పొదుపు సంఘం యొక్క ఆర్థిక లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి పారదర్శకంగా ఆడిట్ చేసేలా ఈ సీఆర్‌పీలు తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా పొదుపు గ్రూపు సభ్యులు కూడా క్రమం తప్పకుండా రిజిస్టర్లు, రికార్డు నిర్వహణ పారదర్శకంగా చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పొదుపు సంఘం తప్పనిసరిగా ప్రతి సంవత్సరం మార్చిలోగా ఆడిట్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర కార్యదర్శి ధనమ్మ, సీసీలు రాజశేఖర్, చైతన్యబాబు, రాము, శోభ, తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటించాలి




కోవూరు, నవంబం12 ప్రభాతవార్త : ప్రస్తుతం ఈ సీజన్‌లో వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ ఇచ్చే సలహాలు, సూచనలు తప్పక పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం ఈ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు చల్లే వారు పశువుల ఎరువును తప్పనిసరిగా నారుమడి దుక్కిలో వేయాలని సూచించారు. విత్తనం చల్లిన 10 రోజులకు , నారు తీయుటకు ఒక వారం ముందు కార్బోఫిరాన్ గుళికలు 120 గ్రాములు 5 సెంట్లకు వేసుకోవాలని దీని వలన మోము పిప్పి ఆకుముడత నుంచి కాపాడుకోవచ్చున్నారు. నాట్లు వేసే సమయంలో ఆర్ఎన్ఆర్ 15048 అయితే 44 దుబ్బులు ఉండాలని, వీలైనంత వరకు లేత నారు ఉన్నట్లయితే పిలకలు బాగా పెట్టి దిగుబడిలు బాగా పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. బీపీటీ 5204 అయితే 33 లేక 44 దుబ్బులు ఉండేలా రైతులు దృష్టి పెట్టాలన్నారు. నారుమడిలో గానీ, నాట్లు వేసిన పొలంలో గానీ మోము పిప్పి , ఆకుముడత చిలుకలు ఉన్నట్లయితే వేపనూను 5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పురుగుమందులు వాడే సమయంలో తప్పనిసరిగా వ్యవసాయ శాఖ సూచనలు తీసుకోవాలన్నారు. కొంతమంది రైతులు అవసరం లేకున్నా ఈ మందులు పిచికారి చేయడం వలన మిత్ర పురుగులు కూడా నష్టపోయే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు వంశీ, పశు సంవర్ధక శాఖ సహాయాధికారి మహేశ్వరి, తిరుపతి వ్యవసాయ కళాశాల యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అకాల వర్షం.. ఇబ్బందుల్లో ప్రజలు



కోవూరు, నవంబం12 ప్రభాతవార్త : కోవూరు మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి కురిసిన అకాల వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ అకాల వర్షం కారణంగా మురుగుకాలువలు సైతం పొంగి సిమెంట్ రోడ్లపై ప్రవహించాయి. ప్రతి నిత్యం కూలీ పనులు చేసుకునే వారు ఈ వర్షంతో పనులు లేక ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న రహదారులు ఈ వర్షపునీటితో నిండి పాదాచారులకు సైతం ఇబ్బందులను కలుగజేశాయి. మండలంలోని పలు ఉన్నత పాఠశాలలో ఉన్న క్రీడా మైదానాలు వర్షపునీటితో నిండిపోయాయి. ఈ క్రీడా మైదానాలు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద లెవలింగ్ చేయాలని గతంలో నిధులు మంజూరైనా ఆ పనులు ప్రస్తుతం చేపట్టిన దాఖలాలు లేవు. దీనికి సంబంధించి సంబంధిత అధికారులు స్పందించిన క్రీడా మైదానాలను లెవలింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

## వైభవంగా పల్లకి సేవ



కోవూరు, నవంబరు12 ప్రభాతవార్త : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో కార్తీక మాస చిలుక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారంఆలయ ప్రధాన అర్చకులు నాగ రాజాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలో ఎల్లకి సేవ కార్య క్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. రుత్వికులు రుత్వికులు శ్రీకాంతాచార్యులు, కృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, గిరినంద స్వామి, సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణికుమార్ స్వామి, తదితరులు భక్తులు ఉన్నారు.

## ఆర్ఎస్ఆర్‌లో న్యూస్‌లెటర్ ఆవిష్కరణ



**బిట్రగుంట, నవంబర్12, ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ట్రిబుల్ఈఈఈడిపార్ట్‌మెంట్‌కు చెందిన ఈఈఎక్స్‌ప్రియా పేరుతో న్యూస్ లెటర్‌ని ఆవిష్కరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఆవిష్కరించిన ఈన్యూస్ లెటర్‌ద్వార ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంటుకు చెందిన అన్ని కార్యకలాపాలు అవగాహన శిభిరా లు ఇందులో పొందుపరచి విద్యార్థులకు, యూనివర్సిటీకి తెలియజేసేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎఒ ఆర్‌వి రమణారెడ్డి ఈఈఈహెచ్ఒడి పివి రామ్‌కుమార్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం




**బిట్రగుంట, నవంబర్12, ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని ముంగమూరు, ఏనుగులబావి గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగ రైతులకు ప్రస్తుల రబీసీజన్‌లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యంవంటి వాటిగురించి అవగామన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరులకేంద్రం అధికారిణి జి మదురిమ. మండల వ్యవసాయ శాఖాదికారిణి ఎస్ విజయలక్ష్మి, వ్యవసాయశాఖ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

## వర్షంతో ఊపిరపీల్చుకున్న రైతన్నలు



జలదంకి, నవంబర్12, ప్రభాతవార్త:అల్పపీడనం కారణంగ మంగళవారం తెల్లవారు జామునుంచి జలదంకి మండలంలో వర్షం కురుస్తుందిఈవర్షంతో గ్రామాలలోని రైతన్నలు హమ్మయ్య అంటు ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం సాగునీటి ఎద్దడిఏర్పడి కర్షకులు అష్టకష్టాలు పడుతున్నారు. కావలి కాలువద్వార సరఫరాఅయ్యే సోమశిల జలాలు అందక వారు తీవ్ర ఆవేదన చెందుతు ఏమిచేయాలో పాలుపోక దిక్కులు చూస్తున్నారు. సెప్టంబర్‌లో కురిసిన వర్షాలకు విత్తన చల్లకాలు చల్లి నారుమడులను పెంచారు. ప్రస్తుతం మడులు పక్వానికివచ్చి వేతకు సిద్ధంగ వున్నాయి. దుక్కిలుచేసి నారేతలు వేద్దామనుకున్న వారికి వర్షాల జాడలేకపోవడం ఆదుకుంటాయనుకున్న సోమశిల జలాలు పారకపోవడం వంటివాటితో అన్నదాతలకు దిక్కుతోచనిస్థితి. నాయకులను అధికారులను ఆశ్రయించి వేడుకుంటే కావలి కెనాల్ పూడికతీత తదితర కారణాలను చూపిఅందరిని ఆందోళన పడేలచేశారు. దీంతో ఏంచేయాలి దేవుడా అంటు నిట్టూర్చి దిగాలు పడిన సందర్భంలో మంగళవారం బారీవర్షం పడిందిదీంతో తెల్లవారేసరికి కయ్యలలో ఎటుచూసిన వర్షపునీరు తాండవమాడుతు కనిపించాయి, ఈపరిణామానికి ఎగిరిగంతేసిన రైతులు పారలుపట్టిపరుగులు తీశారు. మడవలు వేయడం నీరు దిగువప్రాంతాలకు విడుదల చేయడంవంటి పనులతో బిజీబిజి అయ్యారు. ప్రస్తుతం వేతలకు సిద్ధమై జోరుపెంచారు. వరుణదేవుడు కరుణించాడు ఇక సాగునీటి ఇబ్బందులు తొలిగినట్టేనని ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

## నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



వరికుంటపాడు, నవంబర్12, ప్రభాతవార్త:పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగ మహాత్మాగాంది జాతీయ ఉపాదిహామి పథకంకింద చేపట్టినసిమెంటురోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని పంచాయతిరాజ్ డిఇ మణికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నల్లపోతులవారిపల్లిగ్రామంలో సిమెంట్‌రోడ్ నిర్మాణానికి సంబందించి పనులను ఆయన పరిశీలించారు. అలాగే కామ్‌చెరువు గ్రామంలో షుమారు పదిలక్షల రూపాయలతో చేపట్టిన సిసిరోడ్ పనులను మండల పంచాయతిరాజ్ ఎఇ రవీంద్రనాద్ పరిశీలించి నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగ పాటించాలనికాన్‌ట్రాక్టర్‌కు సూసించారు. ఈసందర్భంగ ఆయన మాట్లాడుతు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాన్‌ట్రాక్టర్లు నాణ్యతతో కూడినప్రమాణాలు పాటించాలని సిమెంటురోడ్ల నిర్మాణాల అనంతరం క్యూరింగ్ చేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో టిడిపి నేత గుంటుపల్లి నాగ బూషణం, వర్క్‌ఇన్‌స్పెక్టర్ చీదర్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు, నవంబర్ 12, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసే విధంగా చూడాలని సీఎంకు ఎమ్మెల్యే ఇంటూరి వినతిపత్రం అందజేశారు.

## ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగను కలిసిన యానాది సంఘాల మహాకూటమి



ఉలవపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త మాదిగల ఆరాధ్య దైవం 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణపై అలుపెరగని పోరాటం ద్వారా నేడు ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న మాదిగల ముద్దుబిడ్డ మందకృష్ణ మాదిగని యానాది సంఘాల మహాకూటమి నెల్లూరు జిల్లా కోశాధికారి కత్తి బాలకోటయ్య రాష్ట్ర కోశాధికారి చలంచర్ల ప్రసాద్ రమణమ్మ, కమిటీ సభ్యులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పిస్తూ ఎస్సీ వర్గీకరణతో పాటుగా రాష్ట్రంలో అన్ని రంగాల్లో ఏ అభివృద్ధికి నోచుకోని కటిక పేదరికంతో మగ్గిపోతూ రాజకీయ పార్టీల మోసపూరిత మాటలకు బలవుతున్న యానాదుల కుటుంబాలలో వెలుగులు నింపాలనే దృఢ సంకల్పంతో నేడు ఎస్సీ వర్గీకరణపై ముందుకు సాగిపోతున్న మీ పూర్తి సహకారం కావాలని వినతిపత్రం ద్వారా తెలియజేశారు. ఈ విషయంపై మంద కృష్ణ మాదిగ స్పందించి మీరు అడిగిన మీన్యాయమైన పోరాటానికి అన్ని వేళలా ఎమ్మార్పీఎస్ సపోర్టు ఖచ్చితంగా ఉంటుందని ఈ రోజు నుంచి మాదిగలకు అన్నగా ఉన్న నేను యానాదులకు కూడా అన్నగా ఉంటానని ఎస్సీ వర్గీకరణతో పాటు ఎస్టీ వర్గీకరణపై కూడా గొంతుకనై పోరాడుతానని ఎస్టీ వర్గీకరణ సాధించేంత వరకు మీకు అన్ని విధాల అండగా ఉంటానని సంపూర్ణంగా హామీ ఇచ్చిన మంద కృష్ణ మాదిగకు యానాది సంఘాల మహాకూటమి అభినందనలు తెలియజేశారు.

## తుమ్మలపెంట సముద్రం వందడుగులు ముందుకు వచ్చింది!



**కావలిరూరల్, నవంబర్ 12 ప్రభాతవార్త** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి మూడురోజులపాటు వర్షాలు కురుస్తుండడం వలన కావలి రూరల్ మండలం తుమ్మలపెంట సముద్ర తీరప్రాంతంలో అలలు 50 అడుగుల నుండి 100 అడుగుల వరకు ముందుకు వచ్చి సముద్రతీరప్రాంతం మంగళవారం కోతకు గురికావడం జరిగింది. మత్స్యకారులు తమ బోట్లను లోతట్టుప్రాంతాల నుండి ఎత్తైన ప్రాంతానికి తరలించుకోవడం జరిగింది. మండలంలోని ప్రజలను మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. వీలైనంతవరకు లోతట్టు ప్రాంత ప్రజలు తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని మత్స్యకారులు ఎవరుకూడా సముద్రవేటకు వెళ్లరాదని అధికారులు కోరారు. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ తగిన సలహాలు, సూచనలు తెలియచేశారు.

## బుచ్చిలో జోరు వర్షం జలమయమైన రోడ్లు



**బుచ్చి నవంబర్ 12 ప్రభాతవార్త** అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మంగళవారం ఉదయం నుండి వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. బుచ్చి టౌన్‌లో చెన్నూరు రోడ్డు పూర్తి స్థాయిలో జలమయమైంది. ఇరుకు సందులలో నీళ్ళు పెద్దఎత్తున నిలిచిపోయాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్దపెద్ద ఉరుములు, మెరుపులు ప్రజల్ని భయభ్రాంతుల్ని చేశాయి.

## సంగం మండలంలో 9.4 ఎంఎం వర్షపాతం



**సంగం నవంబర్ 12 ప్రభాతవార్త** అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మంగళవారం విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం వేకోజామునుండి జోరుగా వర్షం కురువడంతో 9.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జనజీవనం స్తంభించింది. రోడ్లన్నీ వెలవెల బోయి కనపించాయి. కూలి పనులు చేసుకునే వారు ఇండ్లకే అంకితమైయ్యారు. వర్షానికి రోడ్లు న్ని జలమయమైయ్యాయి.

## గిరిజనులకు 7.557 కోట్లరూపాయలు కేటాయించడం హర్షనీయం



కావలిరూరల్, నవంబర్ 12 ప్రభాతవార్త గిరిజనుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన రాష్ట్ర తొలిబడ్జెట్‌నందు గిరిజనులకు 7.557 కోట్లరూపాయలు కేటాయించడం హర్షనీయమని తెలుగుదేశంపార్టి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య తెలియచేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర గిరిజనుల సమస్యలకు శాస్వతపరిష్కారదిశగా ప్రభుత్వం అడుగులువేయడం జరుగుతుందని గిరిజనుల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి కావలి నియోజకవర్గంలో గిరిజనులకు అండగా ఉంటున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలకు ధన్యవాదాలు తెలియచేశారు.

## వీరభద్ర స్వామి ఆలయంలో అన్నదానం



విడవలూరు, నవంబర్ 11, ప్రభాతవార్త మండల కేంద్రం గ్రంథాలయం వీధిలో ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామికి మంగళవారం పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, కుంకుమార్చన, అలంకరణ చేయడంతో స్వామివారు భక్తులకు భద్దుడు రూపంలో దర్శనమిచ్చారు. అయ్యప్ప స్వాములు ఆలయానికి చేరుకొని భక్తి గీతాలు ఆలపించడంతో భక్తులను పరవశింప చేసినది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా కొలమాల శ్రీనివాసులు, సుభాష్నమ్మ వ్యవహరించారు. అర్చకులు విడవలూరు మురళి స్వామిపాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే తండ్రి జయంతి వేడుకలు



విడవలూరు, నవంబర్ 12, ప్రభాతవార్త మండలం రామచంద్రపురం పంచాయతీ పొన్నపూడి వెంకటనారాయణపురం గ్రామంలో మత్స్యకారులు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి ఆదినారాయణ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1977 ఉండడానికి స్థలం లేకపోతే 80 ఎకరాల భూమి, ఇల్లు నిర్మాణం కోసం 40 ఎకరాలు పొలం ఉపయోగించుకోమని చెప్పిన ఘనత ఆదినారాయణ రెడ్డికే దక్కిందన్నారు. ఆ కాలంలో మత్స్యకార గ్రామాల్లో కలరావ్యాధి వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారి వాహనంలో తరలించి వైద్యం చేపించి వాడు డాక్టర్లను అందు బాటులో పెట్టుకొని మత్స్యకార గ్రామాల్లో పర్యటించేవారు. తమ గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు వచ్చి ముందుండి సమస్యలను పరిష్కరించేవాడని కొనియాడారు. ఆదినారాయణ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

## వర్షంతో సర్వసభ సమావేశం వాయిదా



విడవలూరు, నవంబర్ 12, ప్రభాతవార్త మండల పరిషత్ కార్యాలయంలో జరగాల్సిన సాధారణ సర్వసభ సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీవో నగేష్ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం ఎక్కువగా రావడంతో మండల ప్రజా ప్రతినిధులు సమావేశం రావడానికి ఆటంకాలు జరిగినవి కాబట్టి వాయిదా వేయడం జరిగింది అన్నారు.

# మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులు అరికట్టాలి



కావలి, నవంబర్ 12 ప్రభాతవార్త మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులు అరికట్టాలని సిపియం నేతలు డిమాండ్ చేశారు. సిపియం రాష్ట్ర పిలుపుమేరకు ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కావలి పట్టణ 36వ వార్డు చెరువుకట్ట సంఘం, పెంకుల ఫ్యాక్టరి కాలని, వైకుంఠపురం రోడ్డు ప్రాంతాలలో ప్రజాపోరును నిర్వహించి కరపత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా సిపియం నాయకులు పసుపులేటి పెంచలయ్య, వై.కృష్ణమోహన్, బి.కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనలో మహిళలు, మైనార్టిలు, దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఉందన్నారు. ప్రశ్నిస్తే ప్రశ్నించినవారిపై దాడులు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ విధానాలే ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తుందని విమర్శించారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. మంచి పరిపాలన అందిస్తామనిచెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలను అమలుచేస్తూ ప్రజలపై మోయలేని భారాలను మోపుతున్నాయని దుయ్యబట్టారు. వీటికి వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14వ తేది కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళానాయకులు రత్నమ్మ, మన్నెమ్మ, కేటేశ్వరితోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సమస్యలను సరి చేస్తాం



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 12, ప్రభాతవార్త** మండల కేంద్రం గ్రామ సచివాలయంలో జరిగిన రీ సర్వే కార్యక్రమం తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సమస్యల కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. రైతులకు జరిగిన తప్పిదాలను సరిచేసి వివాదాలకు తావు లేకుండా శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. రైతులు ఏ సమస్య అయినా తాసిల్దార్ కార్యాలయంకు వచ్చి చెప్పుకోవచ్చు అన్నారు. అనంతరం రైతుల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి అరుణ్ కుమార్, మండల సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో శ్రీనివాసులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండిగ్రంథాలయ వారోత్సవాలు

విడ**వలూరు, నవంబర్ 12, ప్రభాతవార్త** మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్స వాలు జరుగునున్నట్లు గ్రంథ భాంధ గారిణి టి.నిరూప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయం నందు పుస్తకాల ప్రదర్శన, వ్యాసరచన, క్విజ్, మొదలైన అనేక కార్యక్రమాలు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తల్లిదండ్రులు వారోత్స వాలకు పంపాలని కోరారు.

## రైతులకు అవగాహన ఏవో శ్రీలక్ష్మీ



కొడవలూరు (విడవలూరు), నవంబర్ 12, ప్రభాతవార్త మండలం కొత్త వంగళ్లు, మిక్కిలింపేట గ్రామాలలో రైతుల కోసం పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నారుమళ్ళ సమయంలో విత్తన శుద్ధి గుర్తించాలి అదేవిధంగా ఐదు సెంట్లు నారుమడికి కార్బో ఫ్యురా న్ 3 కేజీలు గుళికలు 800 గ్రాములు పిచికారి చేసి వాడుకోవలెను తద్వారా పురుగు నివారణ జరుగుతుందని వివరించారు. అదేవిధంగా రైతులు వరి పంటలు మొదటి నుండి కూడా ఎరువులను క్రమం తప్పకుండా వాడినట్లయితే అధిక దిగుబడులతో పాటు ఆదాయం పొందొచ్చని తెలియజేశారు. అనంతరం రైతులు పోసిన నారుమళ్లను పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ పి వెంకటరావు, సిహెచ్ వంశీకృష్ణ, వి వి ఏ జి. రాఘవేంద్ర, మౌర్య, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ



విడవలూరు, నవంబర్ 12, ప్రభాతవార్త మండలంలోని 15 పంచాయతీ లకు సంబంధించి అన్ని శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం ఈనెల 15 తేదీన జరుగుతున్నట్లు ఎంపీడీవో నగేష్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఒకే రోజు రెండు చోట్ల నిర్వహించడం జరుగుతుంది. అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 12, ప్రభాతవార్త** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం ఎంపీడీవో సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పల్లె పండుగకు కార్యక్రమంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే మంజూరు చేసిన 82 లక్షలు పనులు, ఓడిఎఫ్ ప్లస్ సర్వేను పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. మండలంలో 37 అంగన్వాడి కేంద్రాలకు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం మంజూరు కావడం జరిగింది. అలాగే ఇంటి నిర్మాణంకు పనులు కూడా వెంటనే పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా అసిస్టెంట్ ఇంజనీర్ హర్షిత, హౌసింగ్ ఇంజనీర్ ముక్తార్ భాష, మండల విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఘనంగా అన్నదానం



**కోవూరు, నవంబరు12 ప్రభాతవార్త** : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో కార్తీక మాస చిలుక ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేటప్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి దంపతులు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## అధిక నత్రజని వాడకం అనర్ధదాయకం



అనంతసాగరం, నవంబర్12ప్రభాతవార్త: మండలంలోని మినగల్లు, రేవూరు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరిక్షలననుసరించి ఎరువులు వాడాలని ముఖ్యంగా నత్రజని ఎరువులు అధికంగా వాడడం వలన భూమి భౌతిక, రసాయన లక్షణాలు దెబ్బతినడమే కాక పురుగులు , తెగుళ్ళ ఉధృతి పెరుగుతుందని తద్వారా పంట దిగుబడి తగ్గడమే కాక ఖర్చు పెరుగుతుందన్నారు. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడడం వలన ఖర్చు పెరిగి భాస్వరం నేలలో అధికమవడమే కాక జింకు , ఇనుము వంటి సూక్ష్మపోషకాల లోపాలు పైర్లలో కనిపిస్తాయన్నారు. ఎరువులు వాడేటప్పుడు బురద పదును లో వేయాలన్నారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వర్లు, విహెచ్ఎ లక్ష్మి, విఎఎ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి ప్రణాళికపై అవగాహన అవసరం



వింజమూరు, నవంబర్12ప్రభాతవార్త: గ్రామాభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ సిబ్బందికి అవగాహన అవసరమని కె. శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో గ్రామ పంచాయతీ ప్రణాళికపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండలంలోని జడ్పీటిసి సభ్యులు, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, కార్యదర్శులు, ఐసిడిఎస్, ఐకెపి, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీ ప్రణాళిక అభివృద్ధిపై అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలనే సంకల్పంతో ఈకార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. పేదరికం లేని , మెరుగైన జీవనోపాదులు కలిగిన గ్రామం , ఆరోగ్యకరమైన గ్రామం, బలహిత పంచాయతీలు, సమృద్ధిగా నీరు ఉన్న గ్రామం, స్వచ్ఛ మరియు హరిత గ్రామం, స్వయం సమృద్ధి, మౌళిక సదుపాయాలు ఉన్న గ్రామం, సామాజిక న్యాయం, సామాజిక భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలన కలిగిన గ్రామం, మహిళాహిత గ్రామం లక్ష్యంతో ఈకార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ ప్రణాళిక పై గ్రామ సభలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మండల స్థాయిలో మండల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజలతో గ్రామ సభలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రణాళికాభివృద్ధికి అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేస్తారన్నారు. ప్రజలను అవసరాలను గుర్తించి పంచాయతీ నిధులను ఉపయోగించాలన్నారు. ప్రణాళికలు మొత్తం కేంద్ర ప్రభుత్వ యాప్‌లో జనవరి 30నాటికి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. నిధులను మ్యాపింగ్ చేసి అభివృద్ధిపనులను చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, ఎంఇఒ మధుసూధన్‌రెడ్డి, సిడిపిఒ పద్మజాకుమారి, సర్పంచ్‌లు , ఎంపిటిసి సభ్యులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు, వెలుగు సిసిలు, విఒఎలు , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాళ్ళూరు మృతికి సంతాపం

బిట్రగుంట, నవంబర్12, ప్రభాతవార్తఃరాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజి డైరెక్టర్ దగదర్తి మండల సీనియర్ నాయకులు కాంగ్రెస్‌వాది తాళ్ళూరి రమణయ్యనాయుడు మృతికి పిసిసి అధికార ప్రతినిది ఎల్ సురేష్‌బాబు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. గొప్ప కాంగ్రెస్‌వాదిని దగదర్తి మండలంలో సీనియర్ రాజకీయ నాయకుడు మృతి తనను కలచివేసిందని ఈసందర్బంగ పేర్కొన్నారు. రమణయ్యనాయుడు మృతికి తీవ్రసంతాపం వ్యక్తంచేస్తు వారి కుటుంబసభ్యులకు తన ప్రఘాడసానుబూతిని తెలియజేశాడు.

## ఘనంగా హనుమత్ గాయత్రి హోమం



కోవూరు, నవంబరు 12 ప్రభాతవార్త : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో కార్తీక మాస చిలుక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో మంగళవారం హోమ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు శ్రీకాంతాచార్యులు హోమ కార్యక్రమం విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలతో పాటు మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఉన్నారు.

## వైభవంగా కార్తీకమాసం వేడుకలు



విడవలూరు, నవంబర్ 12, ప్రభాతవార్తమండల కేంద్రంలో వెలసియున్న శ్రీ గంగా కామాక్షి దేవి సమేత రామలింగేశ్వర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో కార్తీకమాస సందర్భంగా మహిళలు అధిక సంఖ్య పాల్గొని కార్తిక దీపాలు వెలిగించి మొక్కలు తీర్చుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, పూల అలంకరణ, విద్యుత్ అలంకరణ చేయడంతో స్వామి అమ్మవార్లు అంగరంగ వైభవంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేడు దగదర్తిలో తాళ్లూరి రమణయ్యనాయుడు అంత్యక్రియలు





**కావలి, నవంబర్ 12 ప్రభాతవార్త** ఎపి మార్క్‌ఫెడ్ మాజీ డైరక్టర్, నెల్లూరుజిల్లా కోఆపరేటివ్ మార్కెట్ సొసైటి మాజీ అద్యక్షులు తాళ్లూరి రమణయ్యనాయుడు అంత్యక్రియలు బుధవారం దగదర్తిలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. దగదర్తిలోని ఆయన నివాసంలో మంగళవారం పలువురు రమణయ్యనాయుడు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.

## 14న హనుమాన్ విగ్రహ వాయుప్రతిష్ట

సంగం నవంబర్ 12 ప్రభాతవార్త సంగం మండలం అమరపునాయుడు కంద్రిక గ్రామంలో ఈనెల 14 వ తేది గురువారం ఉదయం10.56 నిమిషాలకు హనుమాన్ విగ్రహ వాయుప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులులగడపాటి రామలక్ష్మమ్మ, బాణా శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. భక్తులు పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గొనిస్వామి వారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.



## తహశీల్దార్ స్ఫూర్తికి సన్మానం



**కొడవలూరు (విడవలూరు) నవంబర్ 12, ప్రభాతవార్త**
మండల తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కొడవలూరు టిడిపి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలవాలు కప్పి సత్కరించారు. అనంతరం పలు గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నక్క రమణయ్య, అంబటి విజయ్ కుమార్, కోవూరు వెంకీ, ఒట్టురు శ్రీనివాస్ యాదవ్, మోరా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వనాధరావుపేటలో భార్యను హత్యచేసిన భర్త

బిట్రగుంట, నవంబర్ 12 ప్రభాతవార్త బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయితీలో మంగళవారం రాత్రి పండు అలియాస్ తస్లిమా అనే వివాహితను భర్త దత్తు దారుణంగా కత్తితో పొడిచి హత్యచేశాడు. కత్తిపోటుకు గురైన తస్లిమా అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న బిట్రగుంట పోలీసులు రంగప్రవేశంచేసి హత్యకు గల కారణాలు తెలుసుకుంటూ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.



## 17న శృంగేరి పీఠాధిపతి కొండబిట్రగుంటకు రాక ఎమ్మెల్యే

**కావలి, నవంబర్ 12 ప్రభాతవార్త** దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన కర్ణాటక రాష్టం శృంగేరిలోని శ్రీ శారదపీఠం పీఠాధిపతి శ్రీశ్రీ విధుశేఖరభారతి స్వామి ఈ నెల 17వ తేది సాయంత్రం 4 గంటలకు కావలి నియోజకవర్గంలోని కొండబిట్రగుంటలో వెలసిఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో తన ఆధ్వర్యంలో కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో చేపట్టే ఆలయ ప్రాకారం ( ప్రహరీగోడ ), గాలిగోపురంలకు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతి స్వామి శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే దగుమాటి తెలిపారు. కావలి నియోజకవర్గంలోని భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు.



## ప్రభుత్వ భూమిని కాపాడండి స్టే ఆర్డర్‌ను రద్దు చేయండి

### టిడిపి నాయకులు ప్రవీణ్ కుమార్

కొడవలూరు (విడవలూరు), నవంబర్ 12, ప్రభాతవార్త మండలం నార్త్ రాజుపాలెం జాతీయ రహదారి ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూమిపై స్టే ఆర్డర్‌ను ఎందుకు రద్దు చేయడం లేదని తువ్వర ప్రవీణ్ కుమార్ కొడవలూరు గ్రామంలో జరిగిన రీ సర్వే గ్రామసభ కార్యక్రమంలో పాల్గొని తాసిల్దార్ స్ఫూర్తి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సర్వే 380/ఏ, బిలో 5.15 సెంట్లు ప్రభుత్వ భూమిపై మేరీ స్వర్ణ కుమారి స్టే ఆర్డర్ తీసుకున్నారు. కోట్ల విలువ చేసే భూమి స్టే రద్దు చేసి కబ్జాదారుల నుండి కాపాడి ఇళ్ల స్థలాలు లేని కొడవలూరు, నార్త్ రాజుపాలెం గ్రామాలకు సంబంధించి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజలకు కేటాయించాలని కోరారు. తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి వివరణ నార్త్ రాజుపాలెంలో ఉన్న భూమికి సంబం ధించి స్టే ఆర్డర్ పై పూర్తిస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా పోశం రెడ్డి సునీల్ కుమార్ రెడ్డి విషయం జెసి కోర్టులో జరుగుతుంది. పై అధికారులు పూర్తి నివేదిక పంపిన తర్వాత పరిష్కారం చేస్తామన్నారు.



## ఎలక్ట్రీషియన్లకు అవగాహన



**నెల్లూరు, నవంబర్ 12, ప్రభాతవార్త-వైద్యం** ప్రైవేటు ఎలక్ట్రిషియన్లకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓర్జా వీర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ వి.విజయం నిర్వహించారు. మంగళవారం నగరంలోని విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో విజయన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎనర్జీ ఎఫిషియన్సీ డవలప్‌మెంట్(ఏపీసీడ్కో), కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ ఊర్జ వీర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 22న వర్చువల్‌గా ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలియజేశారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులో15 నుండి 25 శాతం ఆదా చేసేలా ఇంధన సామర్థ్య ఎల్ఈడీ బల్బులు, బ్యాట్ లైట్‌లు, బీఎల్ డీసీ సీలింగ్ ఫ్యాన్లు, 1.5 టన్ను సామర్థ్యం ఉన్న ఏసీలు, కుకింగ్ స్టౌలు, ఎల్ఈడీ ఇన్వర్టర్ బల్బులను ఈఈఎస్ఎల్ మార్ట్ ఇన్ పోర్టల్ ద్వారా విక్రయించేందుకు ఊర్జ వీర్ సేవలను ఈఈఎస్ఎల్ వినియోగించనుంది. ఈ విక్రయాలపై ప్రతి నెల నిర్ధేశిత మొత్తాన్ని కమీషన్ రూపేనా చెల్లిస్తుందన్నారు. ఈఈ ఎస్ఎల్ స్టార్ రేటెడ్ పరికరాలను రిజిస్టర్డ్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ ప్రమోట్ చేయాలనేదే లక్ష్యమని తెలిపారు. వీరు ప్రమోట్ చేసినందుకు ప్రతి నెల వీరికి ఒక్కొక్క పరికరానికి నిర్ధేశించిన మొత్తాన్ని వీరి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. వీరు ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో మొదటగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా సులభతరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ శక్తిని ఆదా చేసి భావితరాలకు అందించే ప్రయత్నంలో భాగమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్ల ఉత్పత్తి చేయడమే కాబట్టి ప్రతి ఒక్కరూ ఊర్జా వీర్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ శేషాద్రి, బాలచంద్ర, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టౌన్ శ్రీధర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కావలి బెనర్జీ, జిల్లాలోని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఈఈఎస్ఎల్ కంపెనీనుండి గీతా, పోలయ్య, మెశ్రీయు, రిజిస్డర్డ్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

## కింద కూర్చొని జీజీహెచ్‌లో డాక్టర్ నిరసన

**నెల్లూరు, నవంబర్ 12, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ సర్వజన పెద్దాసుపత్రిలో తాను వినియోగిస్తున్న ఒక కుర్చీని తీసేశారంటూ ఒక ఈఎన్‌టీ డాక్టర్ తమ ఇన్‌ఛార్జీ హెచ్‌డీకి వ్యతిరేకంగా మంగళవారం నేలమీద కూర్చొని నిరసన తెలుపుతూ వైద్యసేవలందించారు. ఇద్దరి డాక్టర్ల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ వల్ల రోగులకు సైతం వైద్య సేవలు ఆలస్యమయ్యాయి. ఈ సందర్భంగా నిరసన తెలుపుతున్న చెవి, ముక్కు, గొంతు డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ తనను హెచ్‌ఓడీ శ్రీదేవి వేధిస్తుందన్నారు. ఆమె సక్రమంగా విధులకు రాదన్నారు. తాను పేదలకు అరుదైన ఆపరేషన్లు చేసినందువల్ల అవి పత్రికల్లో ప్రచురితమయ్యాయన్నారు. అప్పటి నుంచి తాను అంటే ఆమెకు అసూయ అని ఆరోపించారు. తాను అడ్మిట్ చేసిన కేస్ షీట్లో సైతం తన పేరు కొట్టేసి ఆమె పేరు రాసుకుందన్నారు. డీఎంఈ ఆదేశాల మేరకు రెండు యూనిట్లు ఉండగా ఈఎన్‌టీ విభాగంలో ఆమె ఒక యూనిట్ మార్చేసిందన్నారు. ఇలా ఒక యూనిట్‌గా మార్చేసినందువల్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ మీద బాధ్యతలు తోసేసి ఆమె విధులకు సక్రమంగా రావడం లేదని, 12 గంటల తర్వాత ఓపీలో ఉండటం లేదని ఆరోపించారు. ఈ విషయాలపై సూపరింటెండెంట్‌కు చెప్పానని, మెసేజ్ పెట్టాడు అయినా స్పందించలేదన్నారు. దీంతో ఆమె తాను ఒకటిన్నర సంవత్సరంగా వాడుతున్న రివాల్వింగ్ ఛైర్ను ఇప్పుడు ఆ డాక్టరమ్మ లాగేసుకుని నన్ను అవమానించిందని అందకే నిరసన తెలుపుతున్నానన్నారు. ఇదే విషయమై ఈఎన్‌టీ విభాగం హెచ్ఏడి డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఆ కుర్చీ ఆ డాక్టర్ మాత్రమే వాడాలని లేదులే అన్నారు. తాను హెచ్ఏడీ కాబట్టి తీసుకున్నానన్నారు. ఆయనకు ఎస్ఎపు కుర్చీ ఉందని తెలిపారు. తాను విధులకు సక్రమంగానే వస్తునానన్నారు. తాను వైద్య విద్యార్థులకు క్లాసులను చెప్పేందుకు ఒక గంట మాత్రమే ఓపీలో ఉండటం లేదని తెలిపారు. డాక్టర్ సుకుమార్ తనపై అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారంటూ ఆరోపించారు. నిరసన విషయం తెలుసుకున్న ఆసుపత్రి ఇన్‌ఛార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాభాషా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ భాష, పీజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, అడ్మిన్ అధికారులు డాక్టర్ కళారాబ్, డాక్టర్ తదితరులు ఆఘమేఘాలపై నిరసన తెలిపే డాక్టర్ సుకుమార్ వద్దకు వచ్చి నిరసన విరమించాలని సూచించారు. ఏదైనా ఉంటే సామరస్యంగా మాట్లాడుకుని పరిష్కరించుకుందామని నచ్చ చెప్పారు. తాను చెప్పిన వాటికి ఆ డాక్టరమ్మ చేత వివరణ రాయించుకోవాలని అప్పుడే నిరసన విరమించుకుంటానని భీష్మించుకున్నారు. దీంతో మధ్యాహ్నం వరకు అలాగే నిరసన కొనసాగింది. ఈ విషయం డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, రోగులలో చర్చనీయాంశంగా మారింది.



## తుఫాన్ హెచ్చరికలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఎమ్మెల్యే

**కావలి, నవంబర్ 12 ప్రభాతవార్త** తుఫాన్ హెచ్చరికల నేపధ్యంలో కావలి నియోజవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తుఫాన్ తీవ్రతపట్ల అవగాహన కలిగి ఉండాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో తుఫాన్ హెచ్చరికలు ఉన్నాయని అందువల్ల తీవ్రమైన పెనుగాలులు, పిడుగులుపడే ప్రమాదం ఉందని అందరూ జాగ్రత్తగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పశువుల కాపరులు, రైతులు, మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. రెవిన్యూశాఖ అధికారులు, సిబ్బంది గ్రామసచివాలయం వద్ద అందరికి అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కావలి నియోజకవర్గంలో ప్రతి మండల కేంద్రంలో సహాయక కేంద్రాలు ఏర్పాటుచేసి ఎవరికే కష్టం వచ్చినా ఆదుకునేవిధంగా సచివాలయ ఉద్యోగులు, టిడిపి పార్టి నేతలకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.



## గ్రామ సభలో అర్జీల వెల్లువ

**కోవూరు, నవంబం12 ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు భారీస్థాయిలో రైతులు అర్జీలు అందజేశారు. గ్రామంలో గత సంవత్సరం ఇనాం భూములకు రైతువారీ పట్టాలు మంజూరు చేశారు. కానీ ఇచ్చిన పట్టాలకు సంబంధించి వెబ్‌లాండ్‌లో నమోదు చేయలేదు. దీని వలన రైతువారీ పట్టాలు ఇచ్చినా, రైతులకు ఏ మాత్రం ప్రయోజనం చేకూరలేదని పలువురు రైతులు ఈ సందర్భంగా అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన పట్టాలు తీసుకుని రుణాలు కోసం వెళ్తే బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వడం లేదని, కనీసం పొలాలు అమ్ముకుందామనుకున్నా వీటికి వెబ్‌లాండ్‌లో నమోదు కాని కారణంగా రిజిస్ట్రేషన్ కావడం లేదని ఈ సందర్భంగా రైతులు అధికారుల ముందు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తమకిచ్చిన రైతువారీ పట్టాలను వెబ్‌లాండ్‌లో నమోదు చేసి రైతులకు మేలు చేయాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. ఇందుకు తహసీల్దార్ నిర్మలానంద బాబా స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు రైతులకు మేలు చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాకేష్, మండల సర్వేయర్ రమేష్‌గౌడ్, గ్రామ దత్తత నాయకులు తిరుమూరు అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, రైతులు ఉన్నారు.



## యనమదలలో రీసర్వే గ్రామ సభ




**చేజర్ల నవంబర్ 12 ప్రభాతవార్త** చేజర్ల మండలంలోని యనమదల గ్రామ సచివాలయంలో మంగళవారం రీసర్వేపై గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దారు మస్తానయ్య అద్యక్షతన గ్రామసభను నిర్వహించి రీసర్వే సంబందించి భూ సమస్యలపై పలు అర్జీలు స్వీకరించారు. అనంతరం తహసిల్దారు మాట్లాడుతు రీసర్వేపై వచ్చినటువంటి వినతులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు ,గ్రామ విఆర్ఒ కోటేశ్వరరావు గ్రామ సర్వేర్ సురేష్ రెవిన్యూ అధికారులుగ్రామస్తులు పాల్గొన్నారు.




## వైభవంగా లక్ష నాగవల్లి పత్ర పూజ





కోవూరు, నవంబరు 12 ప్రభాతవార్త : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో కార్తీక మాస చిలుక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రాతః కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పర్వదినం సందర్భంగా స్వామివారికి లక్ష నాగవల్లి పత్రాలతో సామూహికంగా మహిళలచే పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రుత్వికులు శ్రీకాంతాచార్యులు, కృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, గిరినంద స్వామి, సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణికుమార్ స్వామి, తదితరులు ఉన్నారు.

## కెమెరామెన్ జార్జ్ కి నివాళి అర్పించిన మేయర్ దంపతులు స్రవంతిజయవర్ధన్

**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 12, ప్రభాత వార్త:** నెల్లూరు నగరంలోని దిసెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చ్ లో జార్జ్ కి మేయర్ దంపతులు స్రవంతి జయవర్ధన్ నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు ,జార్జ్ అకాల మరణం చాల బాధాకరం, జార్జ్ వీడియో జర్నలిస్ట్ మాత్రమే కాదు మా సోదరుడిగా మాకు అత్యంత ఆప్తులు ఇలాంటి రోజురావడం చాలాదురదృష్టకరం అన్నారు.



## కార్మిక వర్గానికి బడ్జెట్‌లో ప్రాధాన్యతేది



**బుచ్చి నవంబర్ 12 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక వర్గానికి ప్రాధన్యత ఇవ్వలేదని ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోలగట్ల సురేష్ విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెం సిఐటియు కార్యాలయంలో జరిగిన మండల ఆటో యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ఆర్దిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ట్రాన్స్‌పోర్ట్ రంగానికి,కార్మిక రంగానికి సరైన కేటాయింపులు లేవన్నారు. ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న కార్మిక వర్గానికి నిరాశ ఎదురైందని అన్నారు. లైసెన్స్ ఎఫ్‌సిలు ఇది వరకు మాదిరిగా ఆర్‌టి ఓ అధికారులే ఇవ్వాలన్నారు. సమావేశం అనంతరం 13 మందితో నూతన మండల కమీటిని ఎన్నుకున్నారు. అద్యక్ష కార్యదర్శులుగా పాశం రాజయ్య, దాసరి రాజయ్యలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల అద్యక్ష,కార్యదర్శులు షేక్ మునీర్ అహ్మద్, చల్లకొలుసు మల్లికార్జున, షేక్ ఖాదర్‌బాషాలు పాల్గొన్నారు.